క్లుప్తంగా

మహిళా సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట



వైఎస్సార్‌సీపీ మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తనకల్లు: వైఎస్సార్‌సీపీసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అరుణ (జ్యోతక్క) శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం అరుణకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, విజయలక్ష్మీ, శ్రీనివాసులనాయుడు, హేమశేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, షాన్ వాజ్, డీలర్ నరసింహులు, శంకర్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు



అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి

నల్లచెరువు: శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి అభిషేకాలు తదితర పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాళసముద్రంకు చెందిన ఆర్‌డీటీ డీఎస్‌ఓ శివశంకర్‌రెడ్డి, లక్ష్మీదేవి, మహేశ్వర్‌రెడ్డి, పరిమళ, గంగాధర్‌రెడ్డి, విజయనిర్మల దంపతులు అన్నదానానికి రూ.10వేలు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డికి అందజేశారు.

ఎంపీడీఓను కలిసిన కోటి సుధ

బత్తలపల్లి: ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సౌజన్యకుమారిని జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధిపై వారు ఎంపీడీఓతో చర్చించారు.

వైద్య శిబిరానికి స్పందన

ఎన్‌పీకుంట: అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అదానీ అల్ట్రా మెగా సోలార్ పార్క్‌లో శనివారం గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి పైగా ప్రజలకు వైద్యులు జి.ఆర్.బి.ఎస్, బి.పీ, ఈ.సీ.జీ, టుడీ ఎకో వైద్య సేవలు అందించినట్లు మేనేజర్ ఎం ఎస్ ఎస్ బాలాజీ తెలిపారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 40 మంది రక్తదానం చేశారన్నారు. సీనియర్ ఇంజినీర్లు లోకేష్, బాషా, చంద్రశేఖర్, కిమ్స్ సవేరా వైద్యాధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ ఆలయం హుండీని శనివారం లెక్కించారు. భక్తుల ద్వారా రూ.5,37,800 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజినేయులు తెలిపారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు పాల్గొన్నారు.

పథకాలు సక్రమంగా అమలు చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: అభివృద్ధి, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను అర్హుల చెంతకు చేర్చాలన్నారు. మండలానికి 2400 ఇళ్లు మంజూరు చేశామని, లబ్ధిదారులు సత్వరం నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ కరుణాకర్, హెచ్‌ఓ నవీన్‌కుమార్‌ను సన్మానించారు. జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు పార్వతి, ఆదినారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసులు, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి పాల్గొన్నారు.

ఇంటి వద్దనే సమస్యల పరిష్కారం





పుట్టపర్తి మండలం నిడిమామిడిలో ఓ ఇంటి వద్ద వివరాలు నమోదు చేస్తున్న అధికారులు, తలుపులలో సర్వే చేస్తున్న అధికారులు

- పకడ్బందీగా 'జగనన్న సురక్ష' అమలు
- ప్రతి గడపకూ వెళ్లి ధ్రువపత్రాలు అవసరమైన వారి వివరాల నమోదు

పుట్టపర్తి అర్బన్: ప్రతి ఇంటినీ సందర్శించి ఆ ఇంటిలో ఉన్నవారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సర్వే పకడ్బందీగా సాగుతోంది. పుట్టపర్తి మండలం నిడిమామిడి, కొట్లపల్లి గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి శుభదాస్ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి ఇంటినీ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కుల, నివాస, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, భూ కొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు, మార్పులు, చేర్పులు, ఫ్యామిలీ మెంబర్స్ పత్రం, ఆధార్ అప్డేట్, కుల గుర్తింపు కార్డులు, రేషన్‌కార్డు, విభజన,హౌస్ హోల్డ్స్ విభజన మొత్తం 11 రకాల సేవలను ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అవసరమైన ధ్రువీకరణపత్రాల వివరాలు నమోదు చేసుకున్నారు. వచ్చేనెల 4వ తేదీన గ్రామంలో జరిగే సురక్ష సమావేశంలో ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రంగన్న, మండల కోఆప్షన్ సభ్యుడు మాబూసాహెబ్, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, మాజీ కన్వీనర్ గంగాద్రి, నాయకులు బాలు, శేషాద్రిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

తాడిమర్రి: నార్సింపల్లి గ్రామంలో ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం పర్యటించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ఇంటింటా తిరుగుతూ కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణపత్రాలు అవసరం ఉన్నవారిని గుర్తించారు. సర్పంచ్ నారాయణస్వామి, ఎంఈఓ నాగేంద్ర, అల్లే సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

తలుపుల: తహసీల్దార్ శ్రీధర్, ఎంపీపీ రఫినాయక్ ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు హైస్కూల్ నారాయణ శెట్టి, మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, ఈఓపీఆర్డీ శకుంతల, ఈఓ మాధవరెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, నజీర్, వలీ పాల్గొన్నారు.

కొత్తచెరువు: స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్ శనివారం కొత్తచెరువులోని 1,2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

నల్లమాడ: 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై శనివారం ఎంపీడీఓ కొండన్న ఆధ్వర్యంలో ఎంపీడీఓ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన డాక్యుమెంట్ల సేకరణ తదితర అంశాలపై ఎంపీడీఓ అవగాహన కల్పించారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, పరిపాలనాధికారి రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కనగానపల్లి: ఎంపీడీఓ అలివేలమ్మ నేతృత్వంలో శనివారం మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దృశ్య కళల స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, కార్యదర్శి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పావన్న, అంకే రామకృష్ణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

తనకల్లు: మండల పరిధిలోని మల్లిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాలలో శనివారం ఇంటింటా చేపట్టిన జగనన్న సురక్ష సర్వేను ప్రత్యేకాధికారి సూర్యనారాయణ పరిశీలించారు. ఎంపీడీఓ పూల నరసింహులు, ఈఓఆర్డీ ఆనందయ్య పాల్గొన్నారు.



కనగానపల్లిలో ఇంటింటా జగనన్న సురక్ష నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శివారు కాలనీల అభివృద్ధికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 21వ వార్డులో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, వైఎస్సార్ బీమా రాలేదని, సీసీ రోడ్లు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పింఛను మంజూరు అయ్యేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు ఎమ్మెల్యే ఆదేశించారు. తన భర్త చనిపోయాడని, వైఎస్సార్ బీమా అందలేదని ఓ మహిళ వాపోయింది. సచివాలయ ఉద్యోగులను పిలిపించి ఎందుకు బీమా రాలేదో చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇళ్లముందు సిమెంట్ రోడ్లు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. బిల్లులు పడలేదని జగనన్న ఇళ్ల లబ్ధిదారులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. సంబంధిత అధికారులను పిలిచి బిల్లులు పడేలా చూడాలని ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రతి సంక్షేమ పథకాన్నీ అర్హులైనవారందరికీ అందేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్ కత్తె ఆదిలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ కత్తె పెద్దన్న, వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల ఏర్పాటు



చిన్న నాగప్ప, దేవళానాయక్, రవిప్రకాష్, షంషీర్, చిన్నాదేవి, నరసింహారెడ్డి, సూర్యనారాయణ

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆదేశాల మేరకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎస్సీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా కే.చిన్న నాగప్ప, ఉపాధ్యక్షులుగా దొడ్డెప్ప, ఎం.రవీంద్రను ఎంపిక చేశారు. ఎస్టీ విభాగం అధ్యక్షునిగా ఆర్.దేవళానాయక్, ఉపాధ్యక్షులుగా ఆర్.భాస్కర్‌నాయక్, వీ.పక్కీర్‌నాయక్, బీసీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా ఎం.రవిప్రకాష్, ఉపాధ్యక్షులుగా కే.రవిశంకర్, జే.రవీంద్రను ఎంపిక చేశారు. మైనార్టీ విభాగ కమిటీ అధ్యక్షునిగా ఎస్.షంషీర్, ఉపాధ్యక్షులుగా హబీబుల్లా, ఎస్. హసీం, మహిళా విభాగ కమిటీ అధ్యక్షురాలిగా ఎస్. చిన్నాదేవి, ఉపాధ్యక్షులుగా ఇ.జయమ్మ, ఎం.రమాదేవిని నియమించారు. యూత్ విభాగ కమిటీ అధ్యక్షుడిగా కే.నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా వీ.నారాయణస్వామి, సతీష్‌యాదవ్, రైతు విభాగ కమిటీ అధ్యక్షునిగా వీ.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎం.కృష్ణారెడ్డి, డీ.కుళ్లాయినాయక్‌ను ఎంపిక చేశారు. వీరితో పాటు ఒక్కో కమిటీలో నలుగురు చొప్పున ప్రధాన కార్యదర్శులు, ఎనిమిది మంది చొప్పున కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో కలిపి మొత్తం 23 మంది చొప్పున కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.5.50లక్షలు విలువ చేసే చెక్కులను శనివారం కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సీఎం వైఎస్ జగన్ వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. ఆరోగ్య శ్రీలో లేని వ్యాధులకు వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సైతం సీఎం సహాయ నిధి ద్వారా చెక్కుల రూపంలో సాయం అందిస్తున్నారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రే మళ్లీ మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తెలియజేశారు.

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని ఎగువతూపల్లి గ్రామానికి చెందిన బోజనపు చలమయ్యకు రూ.60వేల చెక్కును ఎమ్మెల్యే సిద్దారెడ్డి శనివారం అందజేశారు. వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, టీచర్లు రెడ్డప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి



జగరాజుపల్లి జగనన్న కాలనీలో లబ్ధిదారులను అభినందిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: నా ఇల్లే నాకు గౌరవం అంటూ గృహ లబ్ధిదారులు శనివారం జగనన్న కాలనీల్లో హౌసింగ్ డే ను ఘనంగా నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాస్, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి జగరాజుపల్లి, కొట్లపల్లి, కొత్త నిడిమామిడి, పెడపల్లి కాలనీల్లో పర్యటించారు. ఇళ్లు పూర్తి చేసిన వారిని అభినందించారు. వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్న ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు వెంటనే మంజూరవుతున్నందున ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ గౌస్ మహమ్మద్, ఏఓ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ: 'నవరత్నాలు..పేదలందరికీ ఇల్లు', ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ ఎనిమిదవ సంవత్సర వేడుకలను శనివారం రెడ్డిపల్లిలో నిర్వహించారు. ఎంపీడీఓ కొండన్న, హౌసింగ్ ఏఈ వరుణ్, ఉపసర్పంచ్ గంగిరెడ్డి పాల్గొన్నారు. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. సత్వరం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం చారుపల్లిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు.

'ఎస్‌బీఐ లైఫ్'తో ప్రయోజనం

ధర్మవరం అర్బన్: ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌తో ఎంతో ఉపయోగమని రీజనల్ డైరెక్టర్ విద్యాధర్ సావంత్ తెలిపారు. ధర్మవరంలోని ఆ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయంలో శనివారం ఎస్‌బీఐ లైఫ్ మిత్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రతి కుటుంబానికీ అందించాలన్నారు. రీజనల్ డైరెక్టర్ విద్యాధర్, రీజనల్ మేనేజర్ హరిచరణ్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ నంబూరి సురేష్, మేనేజర్ జనార్దన్‌శాస్త్రి పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుపై అవగాహన

తలుపుల: ఉపాధిహామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగుపై రైతులకు స్థానిక ఆర్బీటీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. పండ్లతోటల సాగు కోసం ఉపాధి పథకం కింద అందజేసే ప్రోత్సాహకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలన్న అంశాలపై ఏపీఓ గోవిందనాయక్ అవగాహన కల్పించారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పుట్టపర్తి ఎంఈఓ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి. ప్రసాద్‌ను శనివారం గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, ఫౌండర్ రెడ్డివారి శంకర్‌నారాయణ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటరు జాబితా తయారీ

- బీఎల్‌ఓలకు సూచించిన ఆర్డీఓ తిప్పేనాయక్



మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

బత్తలపల్లి: ఓటరు జాబితా తయారీలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని బీఎల్‌ఓలకు ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బత్తలపల్లి, తాడిమర్రి మండలాల బీఎల్‌ఓలతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, బత్తలపల్లి, తాడిమర్రి తహసీల్దార్లు యుగేశ్వరీదేవి, నాగరాజు హాజరయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణకు పోలింగ్ బూత్‌ల పరిధిలో జులై 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందన్నారు. జులై 21నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటా ఓటర్ల పరిశీలన చేపట్టాలన్నారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ, పునః ఏర్పాట్లతో పాటు జనాభా, ఫొటోలు, ఎపిక్స్‌లోని సారూప్య ఎంట్రీల తొలగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు 8రకాల ఫార్మాట్‌లను రూపొందించి తదుపరి ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ సమయంలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీలలో బూత్ స్థాయిలలో క్యాంపులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 26నాటికి క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరించి, జనవరి 1వ తేదీన తుది జాబితా ప్రచురణకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుంటామన్నారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారని తెలిపారు. 1-1-2024 నాటికి 18 సంవత్సరాలు నిండనున్న యువతి, యువకులను ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై యర్రాయపల్లి వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో చెన్నేకొత్తపల్లి మండలం పెద్దమొగలాయిపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈయన వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌లో అనంతపురం వెళ్లి తిరిగి వస్తుండగా అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రున్ని అనంతపురం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాల్యవివాహాలు అరికట్టండి

కొత్తచెరువు: బాల్యవివాహాలతో చోటుచేసుకునే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, సీడీపీఓ గాయత్రి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశమై బాల్యవివాహాలను అరికట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వచ్చిన వెంటనే వారి తల్లిదండ్రులను కలిసి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. జెడ్పీటీసీ గంగాదేవి, సర్పంచ్ రాధ, ఎంపీడీఓ సిద్ధారెడ్డి, సూపర్‌వైజర్ పుష్పలత పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

ధర్మవరం అర్బన్: బైక్ ఢీకొని బాలుడు గాయపడ్డాడు. ఈఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. సత్యసాయినగర్‌కు చెందిన శాంతమ్మ తన కుమారుడు విక్రాంత్‌కుమార్‌తో కలిసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పవిత్ర సూపర్‌మార్కెట్‌కు సరుకుల కోసం వెళ్లింది. తిరిగివచ్చేందుకు ఆటో కోసం వేచి ఉండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. ఘటనలో బాలుడికి తీవ్ర గాయాలు కాగా అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచండి

ముదిగుబ్బ: విద్యార్థుల ఆరోగ్య రీత్యా పాఠశాలలోని మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని స్వీపర్లకు ఎంఈఓ రమణప్ప సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించి వాటిని కార్మికులతో శుభ్రం చేయించారు.

జానపద నృత్యం.. నేత్ర పర్వం





బాలవికాస్ విద్యార్థుల ప్రేమ ప్రవాహం నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న దక్షిణ కర్ణాటక భక్తులు సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన జానపద నృత్య ప్రదర్శన కనుల పండుగగా సాగింది. శనివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ''ప్రేమ ప్రవాహం'' పేరుతో జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు. మహిళా భక్తులు చక్కటి స్వరాలతో భక్తి గీతాలు ఆలపించగా వాటికి అనుగుణంగా విద్యార్థులు నృత్య ప్రదర్శన కొనసాగించారు. సాయంత్రం 'శాంత కనక సుధామృతం' పేరుతో భక్తకనక దాస జీవిత చరిత్రను వివరిస్తూ నాటిక నిర్వహించారు. భక్తుడైన కనకదాస తన భక్తి ప్రపత్తులతో కృష్ణుని దర్శన భాగ్యం పొందిన తీరును చక్కగా వివరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు దంపతులు చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

సీజ్ చేసిన బియ్యం జులై 5న వేలం

పుట్టపర్తి అర్బన్: సీజ్ చేసి 12 ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వ చేసిన 2749.77 క్వింటాళ్ల బియ్యాన్ని జులై 5న వేలం వేస్తున్నట్లు జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి వంశీకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ట్రేడర్లు, మిల్లర్లు, వ్యాపారులు కలెక్టరేట్‌లోనిపౌరసరఫరాల శాఖ కార్యాలయంలో దరఖాస్తులను పొంది అక్కడే జులై 3 లోపు సమర్పించాలన్నారు. జులై 5న సాయంత్రం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

కదిరి టౌన్: అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న 22వ వార్డు కౌన్సిలర్ ఇస్మాయిల్‌ను ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి శనివారం రాత్రి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. డాక్టర్‌గా తగు సూచనలు సలహాలు అందజేశారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం



మాట్లాడుతున్న చంద్రమౌళిరెడ్డి

ధర్మవరం రూరల్: అర్హత ఉన్న ప్రతి పేదకూ ఇల్లు నిర్మించి వారి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, చైర్మన్‌కాచర్ల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ మునీశ్వరనాయుడుతో కలిసి పోతులనాగేపల్లి లేఔట్‌ను సందర్శించారు. ఇళ్లనిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో కలిసి హౌసింగ్‌డేను నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్, హౌసింగ్ ఏఈ బాలాజీ, విద్యుత్ శాఖ ఏఈ జానకి రామయ్య పాల్గొన్నారు.

గోవులను సంరక్షించాలి

ధర్మవరం అర్బన్: గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేసి గో సంతతిని రక్షించాలని వీహెచ్‌పీ నాయకులు విన్నవించారు. ఈమేరకు శనివారం ఆర్డీఓ తిప్పేనాయక్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, టూటౌన్ సీఐ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పులిచెర్ల వేణుగోపాల్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గోమాతకు విశేష ప్రాధాన్యత ఉందన్నారు. గోవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పట్టణ అధ్యక్షుడు పాలిశెట్టి వెంగముని, దేవరకొండ రామంజినేయులు, వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: హిందువులు పవిత్రంగా భావించే గోవులను చంపడాన్ని అడ్డుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేవారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వేణుగోపాల్, హరిప్రసాద్, రామసుబ్రమణ్యం, గోవిందరాజులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందజేయండి

కదిరి అర్బన్: కదిరి నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ-2లు శనివారం ఎమ్మెల్యే సిద్దారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగానికి పెద్దపీట వేశారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కృషిచేయాలని సూచించారు. ఎంఈఓ-2లు ఓబుల్‌రెడ్డి, చెన్నకేశవకుమార్, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, సుబ్బిరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.